సాక్షి
యాదాద్రి భువనగిరి

గురువారం । 21 । ఆగస్టు । 2025



చినవెంకట్‌రెడ్డి కన్నుమూత
ప్రముఖ విద్యావేత్త కొండకింది చినవెంకట్ రెడ్డి(99) ఇక లేరు. అనారోగ్యంతో మంగళవారం రాత్రి కన్నుమూశారు. - 8లో



ఉత్తరాది కూలీలు..
వరి నాట్లతో పాటు పత్తి, ఇతర సాగులో పని చేయడానికి ఉత్తరాది కూలీలు పెద్ద సంఖ్యలో గ్రామాలకు చేరుకున్నారు. - 8లో



చర్యలు తీసుకోవాలి
రోడ్డు వెడల్పు పేరుతో అక్రమంగా ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని పులిగిల్ల గ్రామస్తులు కోరారు. - 8లో

న్యూస్‌రీల్

ప్రీ ప్రైమరీ స్కూళ్లలో అడ్మిషన్లు

భువనగిరి : జిల్లాకు మంజూరైన 36 ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభించినట్లు డీఈఓ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు సంవత్సాలు నిండిన చిన్నారులు అర్హులన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రీ ప్రైమరి స్కూళ్లలో చేర్పించేందుకు నేరుగా సంబంధిత ప్రధానోపాధ్యాయులను, లేదా 9948979973 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎంపికైన పాఠశాలలు ఇవీ..
అడ్డగూడూరు మండలంలో కంచనపల్లి, లక్ష్మీదేవికాల్వ, జానకీపురం, అడ్డగూడూరు, ఆలేరు మండలంలో పటేల్‌గూడెం, మంతపురి, తూర్పుగూడెం, ఆత్మకూర్(ఎం) మండలంలో తుక్కాపూర్, భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడం, సూరేపల్లి, కూనూరు, ముస్త్యాలపల్లి, బొమ్మలరామారం మండలంలో ప్యారారం, సోలిపేట,పెద్దపర్వతాపూర్, నాగినేనిపల్లి, చౌటుప్పల్ మండలంలో పెద్దకొండూరు, గుండాల మండలంలో బ్రాహ్మణపల్లి, తుర్కపల్లి మండలంలో నాగాయపల్లితండా, మాదా పురం, పెద్ద తండా, దిలావర్‌పూర్ ఉన్నాయి. వీటితో పాటు భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు, జలాల్‌పూర్, రాజాపేట మండలంలోని పారుపల్లి, బూరుగుపల్లి,రామన్నపేట మండలంలో ఎన్నారం, మునిపంపుల, శోభనాద్రిపురం, వలిగొండ మండలం లింగరాజుపల్లి, వలిగొండ, ఏదుల్లాగూడెం, యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు, కొత్తగుండ్లపల్లి, ధర్మారెడ్డిగూడెం గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ స్కూళ్లు ఉన్నాయి.

ఆకట్టుకున్న టీఎల్‌ఎం మేళా



బోధన అభ్యసన సామగ్రిని పరిశీలిస్తున్న డీఈఓ సత్యనారాయణ

యాదగిరిగుట్ట: పట్టణంలోని పాత గోశాల ఎస్ఎల్ఎన్ఎస్ కల్యాణవేదికలో బుధవారం ఏర్పాటు చేసిన బోధన అభ్యసన సామగ్రి (టీఎల్‌ఎం) మేళా అకట్టుకుంది. వివిధ పాఠశాలలు తయారు చేసిన బోధన అభ్యసన సమాగ్రిని మేళాలో ప్రదర్శించారు. వాటిని మండల విద్యాధికారి శరత్ యామినితో కలిసి డీఈఓ సత్యనారాయణ పరిశీలించారు. విద్యార్థులకు సులువైన పద్ధతుల్లో బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. 10 ఉత్తమ ఎగ్జిబిట్‌లను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో కోర్టు భవనం పనులు ప్రారంభం



స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి జయరాజు, తదితరులు

భువనగిరిటౌన్ : జిల్లా కోర్టు భవనాల పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు తెలిపారు. భువనగిరి పట్టణ శివారులో కోర్టు నూతన భవ నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని బుధవారం పరిశీలించారు. స్థలాన్ని చదునుచేయడం తదితర పనులను త్వరగా పూర్తి చేయాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులకు సూచించారు. రూ.81 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఆయన వెంట జిల్లా న్యాయసేవా అధికారి సంస్థ కార్యదర్శి మాధవి లత, భువనగిరి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాల్లందాస్ వెంకటయ్య ఉన్నారు.

నేత్రపర్వంగా గజవాహన సేవ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో బుధవారం నిత్యారాధనలో భాగంగా గజవాహన సేవ నేత్రపర్వంగా చేపట్టారు. స్వామి, అమ్మవారి నిత్యకల్యాణ తంతు సందర్భంగా తొలుత గజవాహన సేవను ఊరేగించడం సంప్రదాయం. అంతకుముందు వేకువజామున స్వామివారి మేల్కొలుపులో సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, సహస్రనామార్చన చేశారు. ఇక ఉత్తర దిశలోని మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, ముఖ మండపంలో సువర్ణపుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవారికి శయనోత్సవం నిర్వహించి ఆలయ ద్వారబంధనం చేశారు.



రాచకొండ ఎత్తిపోతల పథకం సాధన కోసం సంస్థాన్‌నారాయణపురం మండలంలోని గిరిజనతండాలో ప్రచార జాత నిర్వహిస్తున్న నాయకులు

రాచకొండ ఎత్తిపోతల సాధన సదస్సును జయప్రదం చేయాలి

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో ఈ నెల 22న రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రాచకొండ ఎత్తిపోతల పథకం సాధన సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసాచారి కోరారు. బుధవారం సంస్థాన్‌నారాయణపురం మండలంలోని కడీలబాయితండా, రాచకొండ, తుంబాయి తండా, రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని తిప్పాయిగూడెం, చౌటుప్పల్ మండలంలో అల్లాపురం, పీపల్‌పహాడ్, నాగారం, తంగడపల్లిలో ప్రచారజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దోనూరి నర్సిరెడ్డి, సుర్కంటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, యాదయ్య, జంగయ్య, నర్సింహ, గాలయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ముందుగానే మద్యం టెండర్లు

రెండేళ్ల కాల పరిమితితో నూతన మద్యం పాలసీ ఖరారు

- నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం
- సెప్టెంబర్ రెండో వారంలోపు షెడ్యూల్, అదే రోజునుంచి దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంపు
- అక్టోబర్‌లో లక్కీ డ్రా
- డిసెంబరు నుంచి కొత్త షైన్స్‌ల నిర్వహణకు అవకాశం
- జిల్లాలో 82 మద్యం దుకాణాలు



సాక్షి, యాదాద్రి: స్థానిక సంస్థలకు త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నూతన మద్యం దుకాణాలకు ముందుగానే టెండర్లు ఆహ్వానించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో భువనగిరి, చౌటుప్పల్, ఆలేరు, యాదగిరిగుట్ట ఎక్సైజ్ సర్కిళ్ల ఉండగా, వాటి పరిధిలో 82 మద్యం షాపులు ఉన్నాయి. మద్యం వ్యాపారులు, ఆశావహులు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు.

నవంబర్‌తో ముగియనున్న ప్రస్తుత లైసెన్స్ కాలం
మద్యం దుకాణాల ప్రస్తుత లైసెన్స్ గడువు నవంబర్ 30తో ముగియనుంది. స్థానిక సంస్థలకు సెప్టెంబర్ 30వ తేదీలోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు ఎన్నికల సంఘం కూడా ఏర్పాట్లు పూర్తి చేసి ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఆ సమయంలో మద్యం షాపుల టెండర్లకు వీలుండదనే ఆలోచనతో ముందుగానే నోటిపికేషన్ జారీ చేసినట్లు తెలుస్తోంది. కాగా గతంలో ఉన్న మద్యం పాలసీ విధానాన్ని ఈసారి కూడా అమలుపరచనుంది. 2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 20 వరకు రెండేళ్ల కాలానికి దుకాణాలను కేటాయిస్తారు.నాన్ రిఫండబుల్ ఫీజు గతంలో రూ.2లక్షలు ఉండగా ఈసారి రూ.3 లక్షలుగా నిర్ణయించారు. ఒక్కరు ఎన్ని దరఖాస్తులైనా వేయొచ్చు.

రిజర్వేషన్ ప్రకారం..
రిజర్వేషన్ల ప్రకారం మద్యం దుకాణాలను కేటాయించనున్నారు. ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం, గౌడ కులస్తులకు 15 శాతం రిజర్వేష కల్పిస్తారు. రిజర్వేషన్ల వెసులుబాటుతో ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

సిద్ధమవుతున్న ఆశావహులు
మద్యం వ్యాపారులు, ఆశావహులు టెండర్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. నాన్ రిఫండబుల్ ఫీజు రూ.3 లక్షలు నిర్ణయించినందున నలుగురైదుగురు కలిసి ఒకరిపై దరఖాస్తు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పబ్లిక్ డిమాండ్ ఉన్న చోట పోటీ ఎక్కువనే ఉండనుంది. క్రితంసారి 3,969 దరఖాస్తులు రాగా.. ప్రభుత్వానికి రూ.79.38 కోట్ల ఆదాయం సమకూరింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈసారి కూడా పోటీ తీవ్రంగా ఉండనుందని ఎక్సైజ్ శాఖ భావిస్తుంది.

లాటరీ పద్ధతిలో కేటాయింపు
నూతన మద్యం టెండర్లకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నోటిఫికేషన్ జారీ చేసింది. సెప్టెంబరు 2వ వారంలోపు షెడ్యూల్ విడుదల చేసి ఆనెల మొత్తం దరఖాస్తులు స్వీకరించి, పరిశీలించే అవకాశం ఉంది. అక్టోబర్‌లో డ్రా పద్ధతిలో షాపుల కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. దుకాణాల వారీగా వచ్చిన దరఖాస్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డబ్బాల్లో వేసి దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ డ్రా తీయనున్నారు.

ఆరు స్లాబ్‌లలో ఫీజు..
జిల్లాలో 82 మద్యం దుకాణాలున్నాయి. జనాభా ప్రాతిపదికన షాపులకు పీజు ఉంటుంది. రెండేళ్ల కాలానికి నాలుగు నెలలకోసారి ఆరు స్లాబ్‌లలో లైసెన్స్‌దారులు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- 5 వేల జనాభా లోపు రూ.50 లక్షలు
- 5 వేల నుంచి 50వేల జనాభాకు రూ.55 లక్షలు
- 50వేల నుంచి లక్ష జనాభాకు రూ.60లక్షలు
- లక్ష నుంచి 5 లక్షల వరకు రూ.65లక్షలు
- 5లక్షల నుంచి 20లక్షల జనాభాకు రూ.85 లక్షలు
- 20లక్షల పైచిలుకు జనాభా ఉంటే రూ. కోటి 10లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. బుధవారం డీపీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బందితో జూమ్ మీటింగ్ నిర్వహించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా డ్రెయినేజీలు, వర్షం నీళ్లు నిలిచిన చోట ఆయిల్‌బాల్స్ వదలాలని సూచించారు. ఓవర్ హెడ్ ట్యాంకులను నెలలో మూడుసార్లు శుభ్రం చేయాలని, నీళ్లలో బ్లీచింగ్ వేయాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, ప్రధాన ఆస్పత్రుల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రై డేగా పాటించాలన్నారు. వర్షాలకు కూలిపోయిన విద్యుత్ స్తంభాలను గుర్తించి యుద్ధప్రాతిపదికన సరి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పైపులైన్ లీకేజీను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు.

యూరియా కొరత వదంతులను నమ్మొద్దు

ఆత్మకూరు(ఎం): అవసరం మేరకు యూరియా ఉందని, రైతులు కొరత వదంతులను నమ్మొద్దని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. బుధవారం ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో నరేష్ అగ్రిమాల్ ఎరువుల షాప్‌ను తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రికార్డులను, ఎరువుల ధరలకు సంబంధించిన పట్టిను పరిశీలించారు. నాలుగైదు రోజుల్లో జిల్లాకు వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా రానున్నట్లు చెప్పారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. కాన్పులు పెంచాలని, నార్మల్ డెలివరీకి ప్రయత్నం చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ లావణ్య, ఎంపీడీఓ రాములునాయక్, వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ, ఏఈఓ సరిత ఉన్నారు.



ఆత్మకూరు(ఎం)లోని ఎరువుల దుకాణంలో ఎరువుల స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్

ఉత్సవాలు ముగిసేవరకు ప్రత్యేక నిఘా

- సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- డీసీపీ అక్షాంశ్‌యాదవ్

ఆలేరు: వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు డీసీపీ అక్షాంశ్‌యాదవ్ పేర్కొన్నారు. ఆలేరు పరిధిలోని వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే ఆలేరులోని గోధుమకుంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండపాల వద్ద ఉత్సవాలు ముగిసే వరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. సీసీ కెమెరాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. రోడ్ల మరమ్మతులు, విద్యుత్ తీగలతో ప్రమాదాలు చోటుచేసుకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించినట్లు డీసీపీ చెప్పారు. నిమజ్జనం జరిగే చెరువుల వద్దకు చిన్నపిల్లలను తీసుకువెళ్లొద్దని కోరారు. చెరువుల వద్ద గజఈతగాళ్లు, క్రేన్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. చెరువుల చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వివిధ శాఖల అధికారులతో సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. వినాయక మండపాల నిర్వాహకులు అధికారుల సూచనల ప్రకారం తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏమైనా ఇబ్బందులు వస్తే పోలీసులు, అధికారులకు సమాచారం ఇవ్వాలన కోరారు. అంతకుముందు ఆలేరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, సీఐ యాలాద్రితో చెరువు వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీసీపీ చర్చించారు.



ఆలేరులోని గోధుమకుంటను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న డీసీపీ

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

రాజాపేట : మండల కేంద్రం రాజాపేటతో పాటు సింగారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బుధవారం హౌసింగ్ పీడీ విజయ్‌సింగ్ పరిశీలించారు.లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి సకాలంలో బిల్లులు పొందాలని సూచించారు. ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఆర్థిక సమస్యలున్న లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల నుంచి రుణాలు ఇప్పించి త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత దశల్లో నిర్మాణాలు పూర్తయినా బిల్లులు రాని పక్షంలో కారణాలు తెలుసుకుని సమస్య పరిష్కరించాలన్నారు. అయన వెంట ఏఈ కోటయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



భువనగిరి శివారులో నూతనంగా నిర్మించిన హోటల్‌కు అనుమతి లేకుండా నిర్మించిన సర్వీస్ రోడ్డు

వాళ్ల అడ్డదారులు.. వీళ్లకు సిరులు!

హైవేల వెంట పెద్ద ఎత్తున హోటళ్లు, దాబాలు, ఇతర వ్యాపార సంస్థలు
- లింకురోడ్ల కోసం జాతీయ రహదారులను తవ్వుతున్న నిర్వాహకులు
- ముడుపులు తీసుకుంటూ వదిలేస్తున్న సంబంధిత అధికారులు
- ఓ రెస్టారెంట్ యజమాని నుంచి రూ.60 వేలు లంచం తీసుకుంటూ సీబీఐకి పట్టుబడిన హైవే పీడీ

సాక్షి యాదాద్రి: జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారులకు కొందరు అడ్డదారులు నిర్మిస్తున్నారు. సర్వీసు రోడ్లు, లింకు రోడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాలకు కారణమవుతున్నారు. రోడ్డు భద్రతా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా నేషనల్ హైవే అధికారులు నోరు మెదపడం లేదన్న విమర్శలున్నాయి. పైగా వారికి హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలు సిరులు కురిపిస్తున్నాయి. ఇందుకు టోల్‌ప్లాజాల సిబ్బంది సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మంగళవారం నేషనల్ హైవే అథారిటి ఆఫ్ ఇండియా పీడీ దుర్గాప్రసాద్‌ను ఒక హోటల నిర్వాహకుడి నుంచి రూ.60 వేలు లంచం తీసుకుంటూ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్విస్టిగేషన్ (సీబీఐ) అధికారులకు నేరుగా చిక్కడం కలకలం రేపింది. గతంలోనూ ఇటువంటి ఘటనలు వెలుగుచూశాయి.

లక్ష రూపాయలు డిమాండ్
జాతీయ రహదారిని తవ్వి లింకు, సర్వీస్ రోడ్లు నిర్మించిన వారిపై నేషనల్ హైవే అథారిటీ అధికారులు చర్యలు తీసుకోవాలి. కానీ, పలుకుబడి కలిగిన వారిని, ముడుపులు ఇచ్చిన వారిని వదిలేస్తున్నారు. వీరికి టోల్‌గేట్ సిబ్బంది కూడా సహకరిస్తున్నారని సీబీఐ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారి–163 వెంట హోటల్ యజమాని, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పీడీకి బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా సిబ్బంది మధ్యవర్తిత్వం వహించినట్లు సమాచారం. ఇందుకోసం పీడీ లక్ష రూపాయలు డిమాండ్ చేశాడు. బుధవారం రూ.60 వేలు తీసుకుంటుండగా సీబీఐ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. పీడీతోపాటు టోల్‌గేట్ సిబ్బందిని విచారిస్తున్నారు.

అన్నీ రూల్స్‌కు విరుద్ధంగానే..
జాతీయ రహదారుల వెంట హోటళ్లు, దాబాలు, టిఫిన్ సెంటర్లు, టీ హౌజ్‌లతో పాటు ఇతర వ్యాపార సంస్థలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారి వెంబడి ఘట్‌కేసర్ నుంచి మొదలుకొని బీబీనగర్, గూడూరు, భువనగిరి బైపాస్, రాయగిరి, వంగపల్లి, ఆలేరు బైపాస్ జనగామ జిల్లా శివారు వరకు వందల సంఖ్యలో ఉన్నాయి. వీటిలో చాలా వరకు అనుమతి తీసుకోకుండానే ఏర్పాటు చేశారు. బాటకోసం జాతీయ రహదారి, సర్వీస్ రోడ్ల వరకు తవ్వకాలు చేపట్టి లింకు చేస్తున్నారు. ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనదారులు రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. బీబీనగర్ టోల్‌గేట్ సమీపంలో అక్రమ ఏర్పాటు చేసిన పార్కింగ్ వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముందు సిగ్నల్ కూడా లేకపోవడం, వాహనాలు వ్యాపార కూడలి వెపు వెళ్లేందుకు ఒక్కసారిగా సర్వీస్ రోడ్డుకు మళ్లుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఏకంగా సర్వీస్ రోడ్డే వేశారు
భువనగిరి శివారులో ఇటీవల ఓ పేరు మోసిన సంస్థ హోటల్‌ను ప్రారంభించింది. హోటల్ వద్దకు వాహనాలు వెళ్లడానికి దారి లేదు. ఇందుకోసం అనుమతి లేకుండా జాతీయ రహదారి నుంచి ఏకంగా సర్వీస్ రోడ్డు నిర్మించారు. హోటల్‌పై ఓ ప్రజాప్రతినిధి ఫిర్యాదు చేయగా.. సర్వీస్ రోడ్డు తొలగించాలని సరదు యజమానికి జాతీయ రహదారి అధికారులు నోటీసు జారీ చేశారు. కాగా హోటల్ యజమాని తనకున్న పలుకుబడిని ఉపయోగించి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను తనవైపు కన్నెత్తి చూడకుండా చేశాడు.

వాహనాల పార్కింగ్‌కు..
బీబీనగర్ మండలం గూడూరు టోల్‌గేట్ ప్లాజా వద్ద జాతీయ రహదారి పక్కన రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా సర్వీస్ రోడ్డు నుంచి దారి ఏర్పాటు చేసుకోగా ఇటీవల హైవే అధికారులు జేసీబీతో తవ్వారు. దీంతో పార్కింగ్ స్థలం లేక కష్టమర్లు రావడం లేదు. ఆర్థికంగా నష్టపోతున్నానని హోటల్ యజమాని ఎన్‌హెచ్ఏఐ పీడీ దుర్గాప్రసాద్‌ను వేడుకోగా రూ.లక్ష ఇవ్వాలని పీడీ డిమాండ్ చేశాడు. దీంతో సదరు రెస్టారెంట్ ఓనర్ సీబీఐ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు తొలుత రెస్టారెంట్ ఓనర్ రూ.60 వేలు ఇస్తుండగా సీబీఐ అధికారులు పీడీని పట్టుకున్నారు.



సర్వీస్ రోడ్డు వెంట నిలిపిన వాహనాలు

రిజర్వేషన్లకు మించి..

- గత స్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్ స్థానాల్లోనూ గెలిచిన బీసీలు
- ఈసారి బీసీలకు 42 శాతం సీట్లు ఇచ్చేలా కసరత్తు
- ప్రభుత్వ పరంగా కుదరకపోతే పార్టీ తరఫున అమలు చేస్తామంటున్న కాంగ్రెస్
- మిగతా పార్టీలూ బీసీలకు ప్రాతినిధ్యం పెంచక తప్పని పరిస్థితి
- రిజర్వేషన్ల అమలుపై రాజకీయ పార్టీల్లో జోరుగా చర్చ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపైనే రాజకీయ పార్టీల్లో విస్తృత చర్చ జరుగుతోంది. సెప్టెంబర్ నెలాఖరులోగా ఈ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఈ రిజర్వేషన్ల అంశంపై ఎలా ముందుకు సాగుతాయన్నది ఆసక్తికరంగా మారింది. జిల్లాలో 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన స్థానాలు, వారు గెలుపొందిన స్థానాలను ఒక్కసారి పరిశీలిస్తే ఆసక్తికరంగా ఉన్నాయి. వారికి కేటాయించిన స్థానాలతోపాటు, జనరల్ స్థానాల్లోనూ బీసీలు పోటీ చేసి సర్పంచ్‌లుగా, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులుగా విజయం సాధించారు. ప్రస్తుతం ప్రభుత్వ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు పలు అడ్డంకులు ఉన్న నేపథ్యంలో పార్టీ పరంగా అమలు చేసే యోచనతో కాంగ్రెస్ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో మిగతా రాజకీయ పార్టీలు తప్పనిసరి పరిస్థితుల్లో బీసీలకు ప్రాతినిధ్యం పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే అన్ని పార్టీలు అమలు చేస్తాయా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది.

2019 ఎన్నికల్లో 23 శాతం.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2019 ఎన్నికల్లో బీసీలు తమకు ఉన్న రిజర్వేషన్లకు మించి స్థానాలను దక్కించుకున్నారు. రిజర్వు అయిన స్థానాలతోపాటు జనరల్ స్థానాల్లో అధిక సీట్లను కైవసం చేసుకున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనే 23 శాతం రిజర్వేషన్ స్థానాలతోపాటు జనరల్ స్థానాల్లో పోటీ చేసి 40 శాతానికి పైగా సర్పంచ్ స్థానాల్లో గెలుపొందినట్లు రాజకీయ పార్టీలు లెక్కలు వేస్తున్నాయి. మరోవైపు ఎంపీటీసీ స్థానాల్లోనూ 35 శాతం వరకు, జెడ్పీటీసీ స్థానాల్లోనూ 25 శాతం వరకు స్థానాలను సాధించారు.

జనరల్ స్థానాల్లో గెలుపు ఇలా..
- నల్లగొండ జిల్లాలో 844 సర్పంచ్ స్థానాలు ఉండగా.. బీసీ రిజర్వేషన్ కింద 209 స్థానాలతోపాటు 79 జనరల్ స్థానాల్లోనూ బీసీలే పోటీ చేసి విజయం సాధించారు. మొత్తంగా 288 స్థానాలను (35 శాతం) బీసీలు దక్కించుకున్నారు. 346 ఎంపీటీసీ స్థానాల్లో రిజర్వుడ్ స్థానాలు 93తోపాటు 23 జనరల్ స్థానాల్లో పోటీ చేసి గెలుపొంది.. మొత్తంగా 121 స్థానాలను బీసీలు దక్కించుకున్నారు. 31 జెడ్పీటీసీ స్థానాల్లోనూ బీసీ రిజర్వుడ్ స్థానాలు 4తో పాటు మరో 4 జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేసి.. 8 స్థానాల్లో గెలుపొందారు.
- సూర్యాపేట జిల్లాలోనూ 475 సర్పంచ్ స్థానాలకు గాను బీసీ రిజర్వుడ్ స్థానాలు 171తోపాటు మరో 52 జనరల్ స్థానాల్లో పోటీ చేసి గెలుపొంది.. 233 స్థానాలను (47 శాతం) బీసీలు దక్కించుకున్నారు. 255 ఎంపీటీసీ స్థానాల్లో 29 రిజర్వుడ్ స్థానాలతోపాటు మరో 50 జనరల్ స్థానాల్లో పోటీ చేసి గెలిచి మొత్తంగా 79 స్థానాలను కైవసం చేసుకున్నారు. 23 జెడ్పీటీసీ స్థానాల్లో 3 రిజర్వుడ్ స్థానాలతోపాటు మరో 2 జనరల్ స్థానాల్లో పోటీ చేసి గెలిచి మొత్తంగా 5 జెడ్పీటీసీ స్థానాలను సాధించారు.
- యాదాద్రి జిల్లాలోని 420 సర్పంచ్ స్థానాల్లో బీసీ రిజర్వుడ్ 117 స్థానాలతోపాటు 59 జనరల్ స్థానాల్లో పోటీ చేసి గెలిచి.. 176 స్థానాలను (42 శాతం) కైవసం చేసుకున్నారు. 117 ఎంపీటీసీ స్థానాల్లో 39 రిజర్వుడ్ స్థానాలతోపాటు 12 జనరల్ స్థానాల్లో పోటీ చేసి గెలిచి మొత్తం 51 స్థానాలను బీసీలు సాధించారు. 17 జెడ్పీటీసీ స్థానాల్లో 4 బీసీ రిజర్వుడ్ స్థానాలతోపాటు మరొక జనరల్ స్థానంలో పోటీ ఐదింటిని దక్కించుకున్నారు.

అన్ని పార్టీలు అమలు చేస్తేనే మేలు
పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు ప్రభుత్వ పరంగా చేస్తేనే మేలు జరుగుతుందని బీసీ సంఘాలు చెబుతున్నాయి. ఒకపార్టీ 42 శాతం రిజర్వేషన్ బీసీలకు సీటు కేటాయించినా, అక్కడ మరో పార్టీ జనరల్ అభ్యర్థిని నిలబెడితే ప్రయోజనం ఉండదని పేర్కొంటున్నాయి. ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42 శాతం అమలు చేసేందుకు తీర్మానం చేసి, రాష్ట్రపతి ఆమోదం కోసం పంపినా సానుకూల నిర్ణయం వెలువడలేదు. జాతీయస్థాయిలో కేంద్రం ఇప్పట్లో నిర్ణయం తీసుకునే పరిస్థితిలేదు. పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లను ఒక్క కాంగ్రెస్ పార్టీ కాకుండా అన్ని పార్టీలు అమలు చేస్తేనే మేలు జరుగుతుందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

క్లుప్తంగా

బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తికి మూడేళ్లు జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తికి మూడేళ్లు జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి ఎస్. రోజారమణి బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నాంపల్లి మండలం చమలపల్లి గ్రామానికి చెందిన మంగళపల్లి యాలాద్రి అదే గ్రామానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి 2014 మే 15న కిడ్నాప్ చేశాడు. బాలిక తల్లి నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అప్పటి సీఐ వెంకట్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ జరిపి నిందితుడు యాలాద్రిని కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన జడ్జి రోజారమణి నిందితుడికి మూడేళ్లు జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రస్తుత సీఐ రాజు, కోర్టు కానిస్టేబుల్ సైదులు, లైజన్ ఆఫీసర్ నరేందర్ సరైన ఆధారాలు కోర్టుకు సమర్పించడంలో సహకరించారు.

కుంటలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


నందిలాల్ భారతి (ఫైల్)

బొమ్మలరామారం: స్నేహితులతో కలిసి కుంటలో ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామ శివారులో గల బ్లూ అగ్రిగేట్స్ స్టోన్ క్రషర్‌లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నందిలాల్ భారతి(25) పని చేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు స్టోన్ క్రషర్ సమీపంలోని కుమ్మరి కుంటలో నీరు చేరింది. నందిలాల్ భారతితో పాటు మరో నలుగురు కార్మికులు మంగళవారం ఉదయం కుమ్మరి కుంటలో ఈత కొడుతుండగా.. లోతు అంచనా వేయకలేక నందిలాల్ భారతి కుంటలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానిక జాలరుల సహాయంతో నందిలాల్ భారతి కోసం గాలించారు. ఎస్డీఆర్ఎఫ్ రెస్క్యూ టీం రంగంలో దిగి మంగళవారం రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం తిరిగి గాలింపు చర్యలు చేపట్టగా.. సాయంత్రం నందిలాల్ భారతి మృతదేహాన్ని కుంటో నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు స్థానిక ఎస్ఐ బుగ్గ శ్రీశైలం తెలిపారు.

కానిస్టేబుల్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు

- కానిస్టేబుల్‌తో పాటు వాహనదారుడికి గాయాలు
- పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఘటన

చౌటుప్పల్ రూరల్: మద్యం మత్తుతో స్కూటీపై వెళ్తున్న వ్యక్తి వాహనాలు తనిఖీ చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్‌తో పాటు వాహనదారుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎస్కే ఆసిఫ్ మంగళవారం రాత్రి పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. విజయవాడ వైపు నుంచి హైదరాబాద్‌కు స్కూటీపై వెళ్తున్న హైదరాబాద్‌లోని కొత్తపేటకు చెందిన విశాల్‌ను ఆపబోయాడు. కానీ మద్యం మత్తులో ఉన్న విశాల్ స్కూటీతో హెడ్ కానిస్టేబుల్ ఆసిఫ్‌ను ఢీకొట్టి పారిపోయే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో విశాల్ స్కూటీ పైనుంచి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ ఆసిఫ్ కాలు విరగడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విశాల్‌కు స్వల్ప గాయాలు కావడంతో కొత్తపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు.

వ్యవసాయ పనుల్లో ఉత్తరాది కూలీలు

- గ్రామాల్లో కూలీల కొరత తీరిందంటున్న స్థానిక రైతులు
- వలస కూలీలకు షెల్టర్ ఏర్పాటు చేస్తున్న అన్నదాతలు


చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో పత్తి చేనులో పనిచేస్తున్న వలస కూలీలు

చౌటుప్పల్ రూరల్: గ్రామాల్లో రైతులు కూలీలు కొరతతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూలీల ఆగమనం ప్రారంభమైంది. దీంతో వలస కూలీలు రైతులకు వ్యవసాయ పనుల్లో బాసటగా నిలుస్తున్నారు. ముఖ్యంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో వరి నాట్లతో పాటు పత్తి, ఇతర పంటల సాగులో పనిచేయడానికి ఉత్తరాది రాష్ట్రాల కూలీలు పెద్ద సంఖ్యలో గ్రామాలకు చేరుకున్నారు. ముఖ్యంగా మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరాఖండ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల నుంచి కుటుంబాలతో కలసి కూలీలు యాదాద్రి భువనగిరి జిల్లాకు వలస వస్తున్నారు. వ్యవసాయ సీజన్ ముగిసే వరకు ఆయా గ్రామాల్లోని రైతుల వద్ద ఉంటున్నారు. చౌటుప్పల్, వలిగొండ, భూదాన్‌పోచంపల్లి మండలాల్లో రైతులు వలస కూలీలపై ఆధారపడి వ్యవసాయ పనులు చేస్తున్నారు. గతంలో మగ కూలీలు మాత్రమే వచ్చేవారు. ఈ ఏడాది మహిళలతో పాటు కుటుంబాలను తీసుకొని వచ్చారు. ప్రతి గ్రామంలో వరి నాట్లు సగం వరకు వలస కూలీలే పూర్తిచేస్తున్నారు.

వ్యవసాయ క్షేత్రాల్లోనే నివాసం, వంటావార్పు..

వలస కూలీలకు రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల వద్దనే నివాస ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడే వారు వంట చేసుకుంటున్నారు. వరి నాట్లకు వెళ్లే కూలీలు ఉదయమే పంట పొలాలకు వెళ్లి నాట్లు వేస్తున్నారు. పత్తి చేలలో కలుపు తీసే పనులకు వెళ్లే వారు వంట చేసుకొని మధ్యాహ్నం భోజనం తీసుకుని వెళ్తున్నారు. స్థానిక కూలీలు ఎకరాకు పది నుంచి పన్నెండు మంది నాట్లు వేస్తే వీరు మాత్రం నలుగురు లేదా ఐదుగురు మాత్రమే పూర్తి చేస్తున్నారు. దీంతో ఖర్చు తగ్గుతుండడంతో రైతులు వలస కూలీల వైపు మొగ్గు చూపుతున్నారు.

అన్ని పనుల్లో ఆరితేరి..

వలస కూలీలు పత్తి చేనులో కలుపు తీయడం నుంచి గుంటుక కొట్టడం, అడుగు మందు వేయడం, పురుగు మందులు కొట్టడం వంటి పనులు చేస్తున్నారు. చౌటుప్పల్ మండలం ఆరెగూడెం, పంతంగి, రెడ్డిబాయి గ్రామాల్లో రైతుల వద్దకు పది కుటుంబాలు వలస వచ్చారు. ఇలా సుమారు ఆయా గ్రామాల్లోనే రెండు వందల మందికి పైగా వలస కూలీలు ఉన్నారు. వీరు ట్రాక్టర్ పనులు కూడా చేస్తున్నారు.

కూలి తక్కువ.. పని త్వరగా..

వలస కూలీలకు ఇచ్చే కూలి స్థానిక కూలీలతో పోల్చితే తక్కువగా ఉంది. వరి నాట్ల కోసం ఎకరాకు రూ.5వేలు ఇస్తున్నారు. స్థానిక కూలీలకు ఎకరాకు రూ.6వేలు ఇస్తున్నారు. పత్తి చేనులో పనికి వెళ్తే వలస కూలీలకు రూ.400 ఇస్తే, స్థానిక కూలీలకు రూ.500 ఇస్తున్నారు. ఇలా కూలీ తక్కువ ఉంటుంది. వీరు పని కూడా త్వరగా పూర్తిచేసుకుని వెళ్తున్నారు.

తొమ్మిది నెలలు ఇక్కడే ఉంటాం



మేము యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి వ్యవసాయ పనులు చేయడానికి వచ్చాం. గ్రామంలోనే రైతు భూమిలో ఉన్న రేకుల షెడ్‌లో ఉంటున్నాం. మా రాష్ట్రం నుంచి మేము ఈ గ్రామానికి 10 కుటుంబాలు వచ్చాం. పత్తి చేనులో పని చేస్తున్నాం. పత్తి ఏరడం అయ్యాక మార్చిలో మా సొంత గ్రామానికి వెళ్తాం. దాదాపు ఇక్కడే తొమ్మిది నెలల పాటు ఇక్కడే ఉంటాం.

– గుడియా, వలస కూలీ, మధ్యప్రదేశ్

మా దగ్గర పనులు లేక ఇక్కడికి వచ్చాం



మా దగ్గర పనులు లేక ఇక్కడికి వ్యవసాయ పనుల కోసం కుటుంబంతో వచ్చాం. మాకు రోజుకు రూ.500 ఇస్తున్నారు. గ్రామంలో ఏ రైతు వద్ద పనులు ఉంటే వారి వద్దకు వెళ్తున్నాం. మాకు రైతులే నివాసం ఉండడానికి రేకుల ఇళ్లు చూపించారు. మేము ఇక్కడికి రాబట్టి నాలుగు సంవత్సరాలు అవుతుంది.

– సంతోష్, వలస కూలీ, ఒడిశా

కూలీల కొరత తీరుతుంది



మాకు ఉన్న 20ఎకరాల భూమితో పాటు కొంత భూమి కౌలుకు తీసుకుని వరితో పాటు పత్తి సాగు చేస్తున్నాం. స్థానికంగా ఉండే కూలీలు సరైన సమయానికి దొరక్క ఇబ్బంది పడేవాళ్లం. వలస కూలీలు రావడంతో మాకు కూలీల కొరత తీరింది. ఉదయాన్నే వచ్చి వ్యవసాయ పనులు చేస్తారు. వీరికి మేమే కావాల్సిన వంట సామాను ఇప్పిస్తాం. మా దగ్గరకు వలస కూలీలు నాలుగు సంవత్సరాల నుంచి వస్తున్నారు.

– రేఖ రాధిక, మహిళా రైతు, పంతంగి, చౌటుప్పల్

పది రోజుల్లో ఇంటింటికి తాగునీరు అందించాలి

- మాజీ మంత్రి జానారెడ్డి


పెద్దవూరలో మహిళతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జానారెడ్డి

పెద్దవూర: పది రోజుల్లో ఇంటింటికి తాగునీటిని అందించాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ నీరు రావడం లేదన్న ఫిర్యాదుతో బుధవారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డితో కలిసి పెద్దవూర మండల కేంద్రంతో పాటు గర్నెకుంట, వెల్మగూడెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ నీటి సరఫరా ఎలా ఉందని ఇళ్లలోకి వెళ్లి మహిళలను అడిగి తెలుసుకున్నారు. మూడు రోజులకు ఒకసారి నీళ్లు వస్తున్నాయని మహిళలు ఆయనకు చెప్పారు. దీంతో అక్కడే ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఎందుకు ఇలా జరుగుతుందని ప్రశ్నించగా.. రోజుకు 400 లీటర్ల నీటిని వాడుకోవాల్సి ఉండగా 1200 లీటర్ల నీటిని వాడుకుంటున్నారని తెలిపారు. ఫ్లో కంట్రోల్ సిస్టం ఏర్పాటు చేస్తే ఎక్కువ తక్కువలు కాకుండా ఇంటింటికి ఒకే పరిమాణంలో తాగునీటిని అందించవచ్చునని అధికారులు పేర్కొన్నారు. చౌరస్తాలో పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న నల్లాను తొలగిస్తే ఇంటింటికి నీళ్లు అందుతాయని తెలుపగా.. వెంటనే తొలగించాలని సూచించారు. మిషన్ భగీరథ పథకానికి సంబంధించి మండలంలో గర్నెకుంట చివరి గ్రామం అని కరెంట్ పోయినా, పైపులు పగిలినా మొదటగా సమస్య ఇక్కడే ఉత్పన్నమవుతుందని భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. వెల్మగూడెంలో గతంలో నిర్మించిన పాత సంపులోకి నీటిని ఎక్కిస్తే గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, పబ్బు యాదగిరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు నాగేశ్వర్‌రావు, కృష్ణయ్య, ఈఈలు శాంతికుమారి, లక్ష్మీనారాయణ, డీఈలు మధు, నిరంజన్‌సిన్హా, ఏఈలు దీక్షిత్, ప్రవీణ్, నడ్డి గోపాలకృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

- పోలీసులను ఆశ్రయించిన పులిగిల్ల వాసులు


పులిగిల్లలో అక్రమంగా కూల్చివేసిన ఇల్లు

వలిగొండ: రోడ్డు వెడల్పు పేరుతో తమ ఇళ్లను అక్రమంగా జేసీబీతో కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పులిగిల్ల గ్రామస్తులు బుధవారం వలిగొండ పోలీసులను ఆశ్రయించారు. వలిగొండ నుండి కాటెపల్లి వరకు నూతనంగా బీటీ రోడ్డు నిర్మిస్తున్నారు. రోడ్డు వెడల్పులో భాగంగా గ్రామానికి చెందిన కొంతమంది ఇంటి యజమానులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇళ్లు కూల్చివేశారు. దీంతో పలువురు బాధితులు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

గర్భిణి మృతి కేసులో ఏడుగురి అరెస్ట్

- అబార్షన్ వికటించి మృతిచెందినట్లు పోలీసుల విచారణలో నిర్ధారణ
- ఆమె భర్తతో పాటు ఆరుగురి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేట టౌన్: గర్భిణికి ఆమె భర్త ఆర్ఎంపీ వైద్యులతో అబార్షన్ చేయించగా.. అది వికటించి ఆమె మృతిచెందింది. దీంతో ఆమె భర్తతో పాటు అబార్షన్ చేసేందుకు సహకరించిన మరో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను బుధవారం సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండలం గోరంట్ల గ్రామానికి చెందిన బయగల శ్రీను, విజిత దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మూడోసారి గర్భవతి అయిన విజిత (ఐదు నెలలు)కు ఈ నెల 15న అకస్మాత్తుగా కడుపులో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు తుంగతుర్తి మండల కేంద్రంలోని సాయిబాలాజీ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యులు బిడ్డ అడ్డం తిరిగిందని చెప్పి వైద్యం చేయగా తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే ఖమ్మంకు తీసుకెళ్లారు. అప్పటికే విజిత పరిస్థితి విషమించి మృతి చెందింది. తన భార్య మృతికి ఆర్ఎంపీ బండి శ్రీనివాస్ కారణమని తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో శ్రీను ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఆర్ఎంపీని విచారించగా అసలు విషయం బయటకు వచ్చింది.

అబార్షన్ చేయించడంతో..

విజితకు ఆమె భర్త శ్రీను ఖమ్మం పట్టణంలో స్కానింగ్ చేయించగా.. కడుపులో మళ్లీ ఆడపిల్లే ఉందని తేలడంతో అబార్షన్ చేయించాలని అనుకున్నాడని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ మేరకు తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ బండి శ్రీనివాస్‌ను సంప్రదించగా.. అతడు మరో ఆర్ఎంపీ పానుగంటి సతీష్‌తో కలిసి విజితకు ఈ నెల 15న తుంగతుర్తి మండల కేంద్రంలోని సాయిబాలాజీ హాస్పిటల్‌లో అబార్షన్ చేశాడని డీఎస్పీ తెలిపారు. ఈ అబార్షన్ వికటించి తీవ్ర రక్తస్రావం జరగడంతో ఆమె మృతి చెందిందని పేర్కొన్నారు. అయితే శ్రీను తన భార్య విజితను ఖమ్మం తీసుకెళ్లి అక్కడ తుమ్మచర్ల అరుణ అనే నర్సును సంప్రదించి లింగ నిర్ధారణ పరీక్ష చేయించాడని, ఖమ్మం పట్టణంలో కల్పన క్లినిక్ నిర్వహిస్తున్న పోలంపల్లి కల్పన లింగ నిర్ధారణ పరీక్ష చేసినట్లు తమ విచారణలో తేలిందని డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా ఖమ్మం పట్టణానికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ సంపేట అశోక్ స్కానింగ్ పరికరంతో లింగ నిర్ధారణ పరీక్ష చేశాడని, అతడికి లింగ నిర్ధారణ పరీక్ష చేసే స్కానర్‌ను పులి వీరభద్రరావు సమకూర్చినట్లు గుర్తించామని డీఎస్పీ వివరించారు.

ఏడుగురి అరెస్ట్, రిమాండ్..

ఈ కేసులో ఏ–1 తుంగతుర్తికి చెందిన ఆర్ఎంపీ బండి శ్రీనివాస్, ఏ–2 విజిత భర్త బోయగల శ్రీను, ఏ–3 ఖమ్మంలో స్కానింగ్ చేసే సంపెట అశోక్, ఏ–4 స్కానింగ్ చేసే పరికరం సమకూర్చిన పులి వీరభద్రరావు, ఏ–5 లింగ నిర్ధారణ పరీక్ష చేయడానికి ఏర్పాటు చేసిన నర్సు తుమ్మచర్ల అరుణ, ఏ–6 కల్పన క్లినిక్ నిర్వాహకురాలు పోలంపల్లి కల్పన, ఏ–7 నాగారం మండలం పసునూరు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ పానుగంటి సతీష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా నాజ్‌నీన్, శంషున్నిసా



ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకుంటున్న నాజ్‌నీన్ ఖుర్షీద్, శంషున్నిసా బేగం

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని ఇస్లాంపుర ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన బయాలజికల్ సైన్స్ టీచర్(స్కూల్ అసిస్టెంట్) నాజ్‌నీన్ ఖుర్షీద్, ఉర్దూ టీచర్(స్కూల్ అసిస్టెంట్) శంషున్నిసా బేగం రాష్ట్రస్థాయి ఉర్దూ మీడియం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారు. బుధవారం వారిని హైదరాబాద్‌లోని తెలంగాణ ఉర్దూ అకాడమీ కార్యాలయంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందన్, తెలంగాణ మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిఫ్ అన్సారి, తెలంగాణ వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ శాలువాలు, పూలమాలతో, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. తమ పాఠశాలకు చెందిన ఇద్దరు టీచర్లు రాష్ట్ర స్థాయి ఉర్దూ మీడియం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం గర్వంగా ఉందని ప్రధానోపాధ్యాయురాలు ఏడబ్ల్యూఎస్ రాబియా అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అయూబ్‌ఖాన్, షేక్ బాబా, అతియా, ఆర్. ప్రవీణ, ఇర్షత్ ఫర్వీన్, పీఈటీ అష్రఫ్ అహ్మద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహకు నవజాత శిశువు అప్పగింత


శిశువును శిశుగృహ సిబ్బందికి అప్పగిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పెద్దఅడిశర్లపల్లి: మూడో కాన్పులోనూ ఆడపిల్ల జన్మించడంతో సాకలేక బంధువులకు అప్పగించిన నవజాత శిశువును బుధవారం ఐసీడీఎస్ అధికారులు నల్లగొండ శిశుగృహ సిబ్బందికి అప్పగించారు. ఐసీడీఎస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలం మునావత్‌తండాకు చెందిన మునావత్ శంకర్, రాణి దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. మూడో కాన్పులోనూ రాణి ఆడబిడ్డకు జన్మించింది. దీంతో ముగ్గురిని సాకలేక నవజాత శిశువును బంధువులకు అప్పగించారు. రాణి కాన్పుకు అమ్మగారి ఇంటికి వెళ్లి రెండు నెలల తర్వాత ఈ నెల 4న మునావత్‌తండాకు శిశువు లేకుండా రావడంతో ఐసీడీఎస్ అధికారులకు అనుమానం వచ్చి ఆరా తీశారు. శంకర్, రాణి పొంతన లేని సమాధానాలు చెబుతుండటంతో మంగళవారం గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు శిశువు తల్లిదండ్రులు, బంధువులను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు. ముగ్గురు ఆడపిల్లలను సాకలేక బంధువులకు అప్పగించారని తేలడంతో శిశుగృహకు అప్పగించారు.

ప్రజా పోరాటాలకు పాటే ప్రాణం

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ



మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

రామన్నపేట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి నేటి ప్రజా పోరాటాల వరకు పాటే ప్రాణంగా నిలిచిందని, భూమి ఉన్నంత వరకు పాటకు మరణం ఉండదని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో బుధవారం రామన్నపేటలో నిర్వహించిన జానపద కళాకారుల ప్రదర్శనను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాటకు, ఆటకు ప్రజలను చైతన్యపరిచే గొప్ప శక్తి ఉందని తెలిపారు. పాశ్చాత్య విష సంస్కృతి వల్ల అంతరించిపోతున్న జానపద కళారూపాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. వందలాది మంది కళాకారులను ఒకే వేదిక పైకి తీసుకొచ్చి ప్రదర్శనలు ఇవ్వడం శుభపరిణామమని కొనియాడారు. ప్రజా నాట్యమండలి ప్రజాపాటకు బహువచనమని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. ప్రపంచీకరణ ముసుగులో ప్రజాకళలు పెట్టుబడిదారుల చేతుల్లో బందీ అవుతున్నాయని, సినిమాలు ఇతర రూపాల్లో వికృతరూపం దాలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజానాట్యమండలి ప్రజల కళారూపాలను భుజానికి ఎత్తుకొని ముందుకుపోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిందు, యక్షగానం, భాగవతం, కోలాటం, బుర్రకథ, డప్పు కళాకారులు తమ కళారూపాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కోఆర్డినేటర్ వేముల పుష్ప, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, పీఎస్ఎం రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటిపాక శివకుమార్, ఈర్లపల్లి ముత్యాలు, దేశపాక రవి, కూరెళ్ల నర్సింహాచారి, వేల్పుల వెంకన్న, మేడి పృథ్వీ, గంటిపాక శ్రీకృష్ణ, కందుల హన్మంత్, జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం పాల్గొన్నారు.

నిండుకుండలా డిండి

డిండి: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు డిండి ప్రాజెక్టుకు వరద భారీగా వస్తోంది. దీంతో గత వారం రోజుల నుంచి డిండి ప్రాజెక్టు అలుగు పోస్తోంది. దీంతో ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగింది. బుధవారం డిండి ప్రాజెక్టులోకి 9932 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ఇరిగేషన్ ఏఈ పరమేష్ తెలిపారు.

అలుగుపోస్తున్న డిండి ప్రాజెక్టు →




ప్రముఖ విద్యావేత్త చినవెంకట్‌రెడ్డి కన్నుమూత


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి



ఏసీబీ డీజీ విజయ్‌కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు పురుషోత్తంరెడ్డి, సత్యనారాయణరెడ్డి

- నివాళులర్పించిన ప్రముఖులు


చినవెంకట్‌రెడ్డి (ఫైల్)

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణానికి చెందిన ప్రముఖ విద్యావేత్త కొండకింది చినవెంకట్‌రెడ్డి(99) మంగళవారం రాత్రి మృతిచెందారు. చినవెంకట్‌రెడ్డికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన కుమారుడు కొండకింది పూర్ణచందర్‌రెడ్డి హైదరాబాద్‌లో ప్రముఖ వైద్యుడు. చినవెంకట్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలోని ప్రముఖులు, రాజకీయ నాయకులందరికీ సుపరిచితుడే. ఈయన స్వస్థలం నకిరేకల్ మండలం ఓగోడు గ్రామం. రైతు కుటుంబంలో జన్మించిన చినవెంకట్‌రెడ్డి పుట్టిన తేదీ 1929 సెప్టెంబర్18 అని సర్టిఫికెట్లలో ఉండగా, కుటుంబ సభ్యులు మాత్రం ఆయన వయస్సు 99 సంవత్సరాలు అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసిన చినవెంకట్‌రెడ్డి 1947లో ఎస్టీయూ నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా ఎనిమిదేళ్లు సేవలందించారు. ఆ తర్వాత హెచ్ఎంగా, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్‌గా పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందారు. సాహితీ మేఖల సంస్థకు జిల్లా గౌరవాధ్యక్షుడిగా చాలాకాలం కొనసాగి సంస్థ అభివృద్ధికి, సాహిత్యాభివద్ధికి కృషి చేశారు.

ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు


చినవెంకట్‌రెడ్డి సతీమణి తారకమ్మ చాలా సంవత్సరాల క్రితమే మృతిచెందింది. ఆమె పేరు మీద కొండకింది తారకమ్మ చినవెంకట్‌రెడ్డి ట్రస్ట్ స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం జిల్లా స్థాయి ప్రతిభా స్కాలర్‌షిప్‌లను అందజేసి తోడ్పాటునందించారు. భారత సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషిచేస్తూనే బాలబాలికల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు జిల్లాస్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసేవారు. పద్యాల పట్ల విద్యార్థుల్లో సన్నగిల్లుతున్న ఆసక్తిని పెంపొందించేందుకు ప్రత్యేకంగా 100 పద్యాలను కంఠస్థం చేసిన వారికి రూ.1,116, 200 పద్యాలు కంఠస్థం చేసిన వారికి రూ.2,116 నగదు బహుమతిని అందించి తన సేవాభావాన్ని చాటుకున్నారు. అదేవిధంగా గతంలో వరద బాధితుల సహాయార్థం సుమారు రూ.10 లక్షల విలువైన దుస్తులు, బ్లాంకెట్లు, లుంగీలు, దోవతులు, చీరలు, షర్ట్స్, ప్యాంట్లు, టవల్స్, బనియన్లు, దుప్పట్లు అందజేశారు.

ప్రముఖుల నివాళి..

చినవెంకట్‌రెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న ప్రముఖులు నల్లగొండ పట్టణంలోని ఆయన నివాసానికి వచ్చి పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, డీఐజీ మహేష్ భగవత్, ఏసీబీ డీజీ విజయ్‌కుమార్, జస్టిస్ నర్సింహారెడ్డి, ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ ఆకుల రవి, అడిషనల్ ఎస్పీ రమేష్, రిటైర్డ్ ఐఏఎస్‌లు పురుషోత్తంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, చొల్లేటి ప్రభాకర్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ మున్సిపల్ చైర్మన్లు పుల్లెంల వెంకట్‌నారాయణగౌడ్, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, అబ్బగోని రమేష్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, బండారు ప్రసాద్, మదర్ డెయిరీ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి, సీపీఎం నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, హాశం, పలువురు డాక్టర్లు, న్యాయవాదులు, లయన్స్‌క్లబ్ సభ్యులు తదితరులు ఉన్నారు.

కలిసిరాని రాజకీయాలు..

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మంచి పేరు గడించిన కొండకింది చినవెంకట్‌రెడ్డికి రాజకీయాలు కలిసి రాలేదు. 1984లో చినవెంకట్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1989లో ఆయనకు నల్లగొండ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి ద్వారా లభించగా.. చకిలం శ్రీనివాసరావు బీ ఫారం క్యాన్సిల్ చేయించడంతో అవకాశం చేజారిపోయింది. 1994లో అప్పటి మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డితో సన్నిహితంగా ఉండటం వలన ఆయన కోరిక మేరకు తెలుగుదేశం పార్టీలో చేరి ఆర్గనైజింగ్ సెక్రటరీ హోదాలో పాలుపంచుకున్నారు. రాజకీయంగా ఏ పదవులను ఆశించలేదు. ఆ తర్వాత ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు.





నివాళులర్పిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, డీఐజీ మహేష్ భగవత్, అడిషనల్ ఎస్పీ రమేష్